




టెలిగ్రాం అందీ అందటంతోనే హడావిడిగా మద్రాసుకి బయలుదేరాను. మద్రాసు మహా నగరంలో మా పినతండ్రి వియ్యన్నగారి పేరు తెలియనివాళ్ళు బహు తక్కువ మంది ఉంటారని చెప్పాలి. న్యాయవాద వృత్తిలో అఖండమైన కీర్తినీ, అమితమైన ధనాన్నీ ఆర్జించిన వ్యక్తి ఆయన. ఎంతటి క్లిష్టమయిన వ్యాజ్యమయినా సరే, ఆయన చేపట్టేడంటే దాని కిక తిరుగుండేది కాదు. కట్టుబట్టలతోటి మద్రాసు చేరిన ఆయన, అనతికాలంలోనే అనేక భవంతులు కట్టించారు. భూములు కొన్నారు. ఆస్తులు సమకూర్చుకొన్నారు.

మా ఇళ్లలో — ఏ శుభకార్యానికయినా ఆయన వచ్చారంటే, మేం చేసే హడావిడి అంతా ఇంతా కాదు! ఆయన చుట్టూ తిరుగుతాం. ఆయనంటే అగ్గగ్గలాడి పోతున్నట్టు నటిస్తాం. ఆయన చెప్పిన పని చెయ్యటానికి ప్రతి ఒక్కళ్లం పోటీపడతాం. సమాజంలో ఆయనకున్న స్థానాన్నీ, ఆయన గడించిన ఆస్తిపాస్తుల్నీ, వాటిని పొందగల వారసుడు లేకపోవడంబట్టే మేమంతా ఆయనపట్ల భయభక్తులతోటి మెలగుతున్నామని ఆయనకీ తెలియకపోదు.

అటువంటి మా పినతండ్రిగారు ఉన్నట్టుండి హఠాత్తుగా మరణించారని టెలిగ్రాం అందింది. అంతే! హడావిడిగా పెట్టెలో బట్టలు పెట్టుకొని బయలుదేరాను.

దేవుడే చెప్పుకోవాలి! నేనంటే మా పినతండ్రిగారికి మంచి అభిమానం ఉండేది! నేను స్టేట్‌బాంక్ ఏజంటుగా ఈ [illegible] మంచి స్థితిలో ఉన్నానంటే [illegible] ఆయన చలవే అని



# వియ్యన్నగారి వీలునామా

## డి. ఎ. సుబ్రహ్మణ్యశర్మ

వ్వాలి. ఆయ నెప్పుడయినా మా ఇంటికి వచ్చినప్పుడు నాతో చాలా ఆప్యాయంగా మాటాడేవారు. నేను కొత్తగా వేసిన చిత్రాలు చూసేవారు. ఆయనకూడా మంచి చిత్రకారుడు కావటంవలన నేను వేసిన చిత్రాల్లోని లోగుల గురించి చర్చించేవారు. చిత్రకళని గురించిన పుస్తకాలని ఇచ్చే జీవితంలో అనుకున్నవన్నీ సాధించినప్పటికీ వారి మాటల్లో అప్పుడప్పుడు అసంతృప్తి ద్యోతక మవుతూనే ఉండేది! అందుకు కారణంకూడా తెలీదు!

### 2

మేము వెళ్ళేటప్పటికే ఇల్లంతా బంధువులతో నిండి ఉంది. ప్రతి వాళ్ళ మొహాలూ దుఃఖభారంతో ఎర్రగా కందగడ్డలకి మల్లే ఉన్నాయి. పెద్ద కాంపౌండ్‌తో, చుట్టూ పూలమొక్కలూ, ఫలవృక్షాలతో కళకళలాడే ఆ భవంతి ఇవాళ చిన్నబోయినట్టు కనిపిస్తూంది! వియ్యన్నగా రా మేడని దగ్గిర ఉండి, తన ఊహలకీ, అభిరుచులకీ అనుగుణంగా కట్టించుకొన్నారు. చాలా కాలంపాటు వా రా మేడలో ఒంటరిగానే నివసించారు. వారికీ, ఈ మేడకీ ఏదో అవినాభావమైన సంబంధం ఉండేది. నేను హాల్లోకి అడుగు పెట్టేప్పటికి ప్రకాశం, సూర్యం కనిపించి ఎంతో ఆప్యాయంగా పలకరించారు. వాళ్ళిద్దరూ మా రెండో పినతండ్రిగా రబ్బాయిలు. బెంగుళూరు నుంచి వచ్చారు. పెద్దతను ప్రకాశం డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. సూర్యం లెక్చరర్. వాళ్ళే నడుం కట్టుకొని మిగిలిన బంధుబలగం సహాయంతో అన్ని పనులూ చేస్తున్నట్టు తెలిసింది. నేను వెళ్ళేప్పటికే దహనసంస్కారాలూ అవీ వాళ్ళే యథావిధిగా జరిపించారు. ఇంట్లో ఉన్న బంధువులు అక్కడా అక్కడా కూచుని వియ్యన్నగారి గొప్పతనాన్ని, గుణగణాల్ని ప్రశంసిస్తూ— 'అటువంటి మారాజు ఇంక లేకుండా పోయాడే?' అని వాపోతున్నారు. ఆ నోటితోనే వియ్యన్నగారి భార్య పెడసరితనాన్ని గురించీ, ఆమె మూర్ఖత్వాన్ని గురించీ, మంకుపట్టు గురించీ ఆడిపోసుకుంటున్నారు.

* * *

కర్మకాండ యావత్తూ సక్రమంగా జరిగిపోయి అప్పుడే రెండు రోజు లవుతూంది. మరీ దగ్గిర బంధువులు తప్పిస్తే మిగిలిన వాళ్లు చాలామంది వెళ్ళిపోయారు.

నేనూ, సూర్యం, ప్రకాశం హాల్లో కూర్చుని మాటాడుకొంటూంటే, గుమాస్తా భుజంగరావుగారు వచ్చారు. ఆయన నన్ను సమీపిస్తూనే ఒక సీలు వేసిన కవరు నా చేతిలో పెట్టి. "అయ్యా! ఇది వారి వీలునామాకి సంబంధించిన కవరు. వారు రెండు రోజులకి పోతారనగా, దీన్ని నా కిచ్చి మీకు అందజేయమన్నారు" అన్నారు. నేను వారి చేతిలోని కవరు అందుకున్నాను. ప్రకాశం, సూర్యం నా చేతిలో ఉన్న కవరు వంక కుతూహలంగ చూస్తున్నారు. పైకి తేలలేదు కానీ, ప్రతి ఒక్కళ్ళం ఆలోచిస్తున్నదీ ఈ వీలునామా గురించే. నేను వాళ్ళు చూస్తూండగానే కవరు చింపి లోపల్నించి ఒక కాగితం పైకి తీశాను. అందులో మాంబళంలో ఉన్న వెంకటశాస్త్రిగారిని కలుసుకోమని వ్రాసి ఉంది. వెంకటశాస్త్రిగారు మా పినతండ్రిగారికి ఆప్తమిత్రుడు. ఇంత క్రితం నే నాయన్ని ఓ మారు చూశాను. వారి దగ్గర తన వీలునామాను భద్రపరిచా రన్నమాట. నేను, ప్రకాశం, సూర్యం అప్పటి కప్పుడే హడావిడిగా బయలుదేరాం వెంకటశాస్త్రిగా రింటికి. మేం వెళ్ళేటప్పటికి ఆయన ఇంట్లో ఉంటాడో, ఉండడో? కొంపతీసి ఏదైనా ఊరికి వెళితే? వెంకటశాస్త్రిగారి ఇల్లు చేరుకున్నాం. ఆయన ఇంట్లోనే ఉన్నారు. ఏభై ఏళ్ల పైబడిన వయస్సు. మనిషి మంచి హుందాగా ఉన్నారు. మమ్మల్ని సాదరాభిమానంగా ఆహ్వానించా రాయన. ఆ తరవాత మేం అడగవలిసిన అవసరం లేకుండానే ఆయన ఒక సీల్డ్ కవర్ మా కిచ్చారు, వియ్యన్నగారు దాన్ని మాకు అందజెయ్యమన్నారని చెప్పిమేం ఆయనకి కృతజ్ఞతలు తెల్పి ఆ కవరు తీసుకొన్నాం. నేను కవరు చింపి లోపలేముందా అని ఆత్రంగా చూశాను. తెల్లటి కాగితం మీద నల్లటి సిరాతో రాయబడి ఉంది, రాయపేటలో ఉన్న డాక్టర్ వేణుగోపాలరావుగారిని కలుసుకోమని. మాకు గోపాలరావుగారు తెలియదు. అయితే, వెంకటశాస్త్రిగారు తన కాయన తెలుసు

ఉత్సాహం తగ్గింది. జీవితంలో పైకి రావాలనీ, బాగా ఆర్జించాలనీ ఆరాటపడటంతోనే నా జీవితం ఇంతవరకూ గడిచిపోయింది. ఇన్నాళ్ళూ చిత్రకళ విషయమే పట్టించుకోలేదు! తిరిగీ చిత్రకళలో కృషి ప్రారంభించా లనిపించింది. పోనీ, ఆ విధంగానయినా మనశ్శాంతి లభిస్తుందేమోనని ఆశ.

ప్రేమేంద్ర మిత్ర అనే ప్రఖ్యాతి పొందిన బెంగాలీ చిత్రకారుడు అడయారులో ఉండేవాడు. ఆయన్ని కలుసుకొని నా అభిలాష వెల్లడించాను. ఆయన నన్ను తన శిష్యుడుగా తీసుకోటానికి అంగీకరించారు. పెద్ద తోటమధ్య ఆశ్రమానికి మల్లే ఉండేది వారిల్లు. అందుకు తగ్గట్టుగానే తన నివాసానికి 'చిత్రకుటీరం'అని పేరు పెట్టుకొన్నారు. ఆయన ఒంటరివాడు. చిత్రకళే ఆయన సర్వస్వం. అన్ని రకాల ఆనందాల్నీ, అనుభూతుల్నీ ఆయన చిత్రకళలోనే పొందేవారు. నేను చిత్రాల్ని వేయటం ప్రారంభించిన కొద్ది కాలంలోనే ఆయనకి అభిమానపాత్రు ణ్నయ్యాను. ఆయన సమధికోత్సాహంతో చిత్రకళలోని వివిధ రీతులను గురించీ, వాటి బాగోగులను గురించి చెప్పేవారు. నాకుమల్లేనే ఆయన దగ్గిర మరో వ్యక్తికూడా చిత్రకళని అభ్యసిస్తూండేది. ఆమె పేరు పద్మిని. ఆమెను చూట్టంతోనే మళయాళీ వనిత అని పోల్చుకోవచ్చు. వయస్సు ముప్పై సంవత్సరాలు పైబడి ఉండవచ్చు. పెద్దగా అలంకరించు కోకపోయినా ఎంతో ఆకర్షణీయంగా ఉండేది.

చిత్రకుటీరానికి ఆనుకొని పెద్ద మర్రిచెట్టు ఉండేది. మండువేసవిలోనయినా ఆ మర్రిచెట్టుక్రింద కూర్చుంటే ప్రాణం ఎంత హాయిగా ఉండేదని! ఆ మర్రిచెట్టు కింద కూర్చునే మా గురువుగారు పిజానే అధునాతన పోకడల గురించీ, విన్సెంట్ వాంగో చిత్రకళలో ప్రవేశపెట్టిన నూతన రీతుల గురించి, పాల్ గాగిన్, పాబ్లో పికాసోల గురించీ, వారి విధానాల గురించీ చెప్పేవారు. అక్కడ కూచునే ● మా ఊహలకి రూపకల్పన చేసి, కొత్త కొత్త రీతుల్లో చిత్రాలు వేసేవాళ్ళం. నే వేసిన చిత్రాల్లోని రేఖలు ప్రస్ఫుటంగా ఉండి, గుండెల్లోని లోతుల్ని పిండి చూపించగల శక్తిని కలిగి ఉన్నవనీ, పద్మిని వేసిన చిత్రాల్లో వర్ణసమ్మేళనం హృదయాహ్లాదకరంగా ఉందనీ మా గురువుగారు అనేవారు.


కొద్ది కాలానికే నాకు పద్మినితో సన్నిహితత్వం ఏర్పడింది! నా గురించి ఏ మాత్రం దాపరికం లేకుండా ఆమెకు చెప్పాను. ఆమె గురించి తెలుసుకున్నాను. వయసులో ఉన్నప్పుడు ఒకతను ఆమెను మోసం చేసి మద్రాసు తీసుకు వచ్చాడట. వివాహం చేసుకొంటానని ఆశపెట్టి కొన్నాళ్ళ ఆమెని అనుభవించి, ఆమెను లోకుల దయాదాక్షిణ్యాలకి వదిలిపెట్టి వెళ్లిపోయాట్ట. ఆమెను ఉంచిన ఇంటి ముందు గదిలో ఉన్న టైలర్, పరిస్థితి గ్రహించి ఆమెని ఆదరించి తన దగ్గిరే ఉంచుకొన్నాడట. ఆమె బాగోగులు నాలుగేళ్ల నించి అతనే చూస్తున్నాట్ట. నన్ను తనతో వాళ్లింటికి తీసుకువెళ్లి, అతనితో పరిచయంకూడా చేసింది. అతనూ మళయాళీ అతనే. వయస్సు ఏభై ఏళ్ల దగ్గిర పడుతూండవచ్చును. పేరు థామస్.

అప్పటినించి ప్రతిదినం ఆమె ఇంటికి వెళుతూండేవాణ్ణి. థామస్‌తో నా మీద తనకి మనసయిందని చెప్పేసిందట! అతనూ ఒప్పుకొన్నాట్ట! ఆ విధంగా ఆమెతో నాకు అనుబంధం ఏర్పడింది! ఆ అనుబంధాన్ని మా మనస్సులు ధ్రువపరిచి బలపరిచాయి. . . నా జీవితంలో కొత్త అధ్యాయం మొదలయింది. మోడయిపోయిన నా జీవన వృక్షం తిరిగి చిగురించటం ప్రారంభించింది. జీవితంలో ఉన్న మాధుర్యాన్ని, విలక్షణమైన అనుభూతుల్ని తొలిసారిగా పొందగలుగుతున్నాను. తాళి కట్టిన స్త్రీ కాకపోయినా, పద్మిని నా భార్య అని చెప్పాలి. ఇక, షణ్ముగం అనే అతను నా కారు డ్రైవర్‌గా ఉండేవాడు. అతను అత్యంత విశ్వాసపాత్రమయిన వ్యక్తి. నే నేం చెప్పినా తు. చ. తప్పకుండా చెయ్యటానికి ప్రయత్నించేవాడు. . . షణ్ముగం, రోజూ నన్ను పద్మిని ఇంటికి తీసుకువెళ్లేవాడు. తిరిగి తీసుకు వచ్చేవాడు. నాకు పద్మినితో గల సంబంధాన్ని గురించి పొరబాటున కూడా ఎవరితోనూ చెప్పలేదు. నే నీ విషయాన్ని రహస్యంగా ఉంచమనీ అతనితో చెప్పలేదు. అయినా, తన యజమాని విషయం నలుగురికీ తెలియటం ఇష్టంలేక కామోసు, ఈ విషయాన్ని గుండెల్లోనే గుప్తంగా దాచుకొన్నాడు!

అప్పుడప్పుడు అనుపమ విషయం గుర్తు వచ్చినప్పుడల్లా, కొద్దిగా బాధ అనిపించినా మొత్తానికిప్పుడు నా జీవితం హాయిగా, ఆనందంగా సాగిపోతున్నదనే చెప్పాలి! బాగా ఆర్జిస్తున్నాను. నా వలన జరిగే ఏ సహాయమైనా, ఎవరికయినా చెయ్యటానికి వెనకాడటం లేదు.

నాకు ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. అందరికీ మంచి సంబంధాలే చూసి వివాహాలు చేశాం. కానీ, ఆఖరి చెల్లెలి పరిస్థితి మాత్రం ఇప్పుడేం బావుండలేదు. ఆమె భర్త దుర్వ్యసనాలకి లోనయి ఇల్లూ, ఒళ్లూ గుల్ల చేసుకొని, హఠాత్తుగా మరణించాడు. ఆమెకి పెళ్లి కెదిగిన ఇద్దరాడపిల్లలూ, పదేళ్ల కుర్రాడూ ఉన్నారు. అభిమానవతి కావటం వలన నాతో తన విషయం చెప్పుకోలేదు. అత్తవారింట్లోనే ఉంది.

అప్పుడప్పుడు అనుకొంటూ ఉండే వాణ్ణి—అనుకోకుండా నేను హఠాత్తుగా మరణించటం సంభవిస్తే నా ఆస్తిపాస్తులు ఎవరెవరి కే విధంగా వెళ్ళాలా అని. అందుకే ఈ వీలునామా రాస్తున్నాను. ఈవీలునామాలోని ఆస్తి పంపకానికి సంబంధించిన నిర్ణయాలు కొంత మందికి అసమంజసంగా కనిపించవచ్చు. అయినా, నేను చిన్నతనంనుంచీ మనసుకు నచ్చిన విధంగానే నడుచుకొనే



వాణ్ణే. ఇప్పుడూ అదే చేస్తున్నాను.

అనుపమా, నేనూ కలిసి జీవించక పోయినా, ఆమె నా పట్ల క్షమించరాని విధంగానే ప్రవర్తించినా నాహృదయంలో ఆమెకు గల స్థానం మాసిపోలేదనే చెప్పాలి. ఇద్దరం ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న మనుషులకి మల్లే ప్రవర్తించాం. జీవన ప్రవాహంలో ఒక చోట కలుసుకొన్నట్టే కలుసుకొని విడిపోయాం. ప్రతి భర్తా తన భార్యపట్ల నిర్వర్తించవలసిన విధులు కొన్ని ఉన్నాయనీ, అవి నాకూ వర్తిస్తాయనీ భావిస్తాను. అవసరం వచ్చినప్పుడు ఎవరి మీదా ఆధార పడకుండా జీవించగలిగే ఆసరా కలిగి ఉండటం కోసం, ఎంతగానో శ్రమించి ఈ నగరంలో నిర్మించుకున్న మూడు భవంతుల్ని అనుపమ పేర వ్రాస్తున్నాను.

ఇకపోతే నా బాంక్ బాలన్స్ రెండు లక్షల రూపాయలకి పైబడే ఉంటుంది. అందులో—జీవితానికి ఒక కొత్త అర్థం చెప్పి, నా జీవితాన్ని సుఖశాంతులతో నింపటానికి తన శాయశక్తులా ప్రయత్నించిన పద్మినికి ఏభై వే రూపాయలు చెందుతాయి.

పద్మినిని ఆపదలో ఆదుకొని ఒక మనిషిగా నిలబెట్టిన థామస్‌కి పదిహేను వేల రూపాయలు చెందుతాయి.

ఇక నా ప్లిమత్ కారు—ఎంతో జాగ్రత్తగా నడిపి, ఎల్లప్పుడూ విశ్వాసపాత్రంగా నడుచుకొన్న నా డ్రైవరు షణ్ముగానికి చెందుతుంది. అతనికి నా కారుతోబాటు మరో పదివేల రూపాయలకూడా చెందుతాయి. ఇక, చిత్రకళ ద్వారా నా కొక కొత్త జీవితాన్ని చూపిన నా గురువర్యులు ప్రేమేంద్ర మిత్ర గారికి పాతిక వేల రూపాయలు చెందుతాయి.

ఇక మిగిలిన లక్ష రూపాయలతో ఒక ట్రస్ట్ ఏర్పరిచి, బీద విద్యార్థులకి నెలనెలా ఉపకారవేతనాలు ఇచ్చేవిధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. విద్యాసముపార్జనకి ఆర్థిక దుస్థితి అడ్డంగా నిలబడకూడ దన్న ఉద్దేశమే నా ఈ నిర్ణయానికి కారణం అయింది.

ఇక నా ఆఖరి చెల్లెలికి మా స్వగ్రామమైన రామచంద్రపురంలో నేను కొన్న పదిహేను ఎకరాల భూమి వ్రాసి ఇస్తున్నాను.

నా అన్నగారి కొడుకూ, తమ్ముడి కొడుకులూ మంచి స్థితుల్లోనే ఉండటం వలన వారి కేవిధమైన ఆస్తీ కేటాయించలేదు.

భగవంతుడు అందరినీ చల్లగా చూడాలనీ, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలనీ ఆకాంక్షిస్తున్నాను...

ఇది వియ్యన్నగారి వీలునామా! ★